ఒకరికి పేరు వస్తుందనే కోపంతో ఎలాగైనా సరే లేకుండా చేస్తే చాలు అనుకుంటోంది కూటమి ప్రభుత్వం. కూటమి నాయకులు అహం చల్లారుతుందనుకో వచ్చేమో కాని పేద ప్రజల సేవలను అడ్డుకుంటాన్న మన్నా ఇంగితజ్ఞానం మాత్రం వారికి లేదు. కేవలం కల్లబొల్లి మాటలు, అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావడమే పరమావధిగా పెట్టుకున్నారే తప్పా చేసిందేమి లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కింది. కానీ నేడు ఏ సేవలూ అందక.. ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



అనంతవరం గ్రామ సచివాలయం

సేవలందక.. పథకాలు ఇవ్వక !

- నియోజకవర్గంలోని దిష్టిబొమ్మలుగా సచివాలయాలు
- కూటమి ప్రభుత్వంలో నేటికీ తెరుచుకోని ప్రభుత్వ సేవలు
- రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలు ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలో తెలియక అర్థం కాని స్థితిలో ప్రజలు

టంగుటూరు: మహాత్మ గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రజల వద్దకే పాలనే ధ్యేయంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి దేశ చరిత్రలో సరికొత్త విప్లవం తీసుకొచ్చారు. మండల కేంద్రాలకు వెళ్లకుండా ఉన్న గ్రామం లోనే సచివాలయాల్లో అన్ని సేవలూ అందేలా చర్యలు తీసుకుంది గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. కాని కూటమి ప్రభుత్వం అంతకంటే మరింతగా ప్రజల వద్దకే పాలన సాగిస్తామంటూ కల్లబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను పక్కన పెట్టి ప్రజల సేవలకు కోతలు పెట్టింది. ప్రజలకు అవసరమైన రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్య శ్రీ కార్డులు, అన్నదాత సుఖీభవ వంటి వైబ్‌సైట్లు ఇప్పటికీ తెరుచుకున్న పాపాన పోలేదు. ప్రజలు ప్రస్తుతం కుల, ఆదాయ ధ్రువపత్రాల వంటి వన్‌బీ వంటి సాధారణ సేవలు మాత్రమే పొందుతున్నారు. దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వం తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సేవలను టీడీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని గ్రామాల్లో పెద్దఎత్తున విమర్శలు చేస్తున్నారు. కేవలం టీడీపీ సభ్యత్వం మాత్రమే చురుకుగా సాగుతోందని ఎద్దేవా చేస్తున్నారు.

కొండపి నియోజకవర్గంలో సచివాలయాలు..

మండలం	సచివాలయాలు
టంగుటూరు	18
సింగరాయకొండ	15
జరుగుమల్లి	15
కొండపి	14
మర్రిపూడి	13
పొన్నలూరు	15

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా ..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పల్లెలోనే సేవలు అందజేసేందుకు ప్రతి గ్రామంలోనూ సచివాలయాన్ని ఏర్పాటు చేసి అనుసంధానంగా 50 గహాలకు ఒక వలంటీర్‌ను నియమించి అన్ని సేవలనూ ప్రజలకు నేరుగా అందించారు. ఒక్కో సచివాలయ భవనాన్ని రూ. 45 లక్షలు వెచ్చించి నిర్మించారు. ప్రజలు తమకు వీలున్నప్పుడే సమస్యలు విన్నవించుకునేందుకు సచివాలయాలు ఎంతో ఉపయోగపడేవి, సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు, విద్యుత్ తదితర సేవలు వివిధ ధ్రువ పత్రాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు, ఆధార్ సేవలు పల్లెలోనే పొందేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఈ సేవలు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాలు వెలవెలబోయాయి. ఇప్పటికే వలంటీరు వ్యవస్థను పక్కన పెట్టిన కూటమి ప్రభుత్వం. సచివాలయ ఉద్యోగులను సైతం తగ్గిస్తోంది.

రేషన్ కార్డు కోసం ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి..



ఏదైనా పనులు కావాలంటే ఒకప్పుడు సచివాలయంలో పొందే వాళ్లం. ఇంటికి వచ్చి మరీ వలంటీర్లు అందించే వారు. ఇప్పుడు ఏవైనా పథకాలు కావాలంటే ఏమి చేయాలో ఎవరిని అడగాలో తెలియడం లేదు. రేషన్ కార్డు కోసం ఎవరిని అడిగినా తమకేమీ తెలియదు అంటున్నారు.

– కే మధు, కొండపి మండలం, కొండపి

గ్రామాల్లో సేవలు కొనసాగించాలి..



గ్రామాల్లో ఏర్పాటైన సచివాలయాలతో గత ప్రభుత్వంలో ప్రజలకు విస్తతమైన సేవలు అందేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాదిరిగానే ఇప్పుడు కూడా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలను సచివాలయాల ద్వారా కొనసాగించాలి. కూటమి ప్రభుత్వం తక్షణం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి.

– సీ హరిబాబు, జిల్లా వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ అధ్యక్షుడు

ప్రభుత్వ సేవలు కొనసాగించాలి..



గ్రామ సచివాలయ, వలంటీర్ల సేవలు కొనసాగించాలి. ప్రభుత్వ ఏర్పాటై 9 నెలలు అయినా ప్రజలకు ఎలాంటి పథకాలూ అందడం లేదు. పేదలకు ఇది దారుణమైన పరిస్థితి. రేషన్ కార్డులతో పాటు పింఛన్ దరఖాస్తుల వెబ్‌సైట్లు తెరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం శ్రద్ధ చూపాలి.

– బొట్ల రామారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం జోన్– 5 ఇన్‌చార్జి


క్లుప్తంగా

110 మందికి వైద్య పరీక్షలు



మర్రిపూడి: మండల కేంద్రం మర్రిపూడిలో పీహెచ్‌సీ వైద్యాధికారి వీరబాబు ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో 110 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. దళితవాడ, గొడాస్ కాలనీ, నడిగడ్డ, పడమటి బజారులో తదితర వీధుల్లో తిరిగి గ్రామస్తులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, సీజనల్ వ్యాధులపై అవగాహన కలిపించారు. బీపీ, షుగర్, జ్వర పీడితులను గుర్తించి మందులు అందజేశారు. గ్రామస్తులకు జబ్బు చేస్తే సమీపంలోని వైద్యశాలకు రావాలని సూచించారు. ఆయన వెంట ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులు, ఎంఎల్‌పీహెచ్, ఆశాలు ఉన్నారు.

ఇంకుడు గుంతల పనుల పరిశీలన



కొండపి: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం మండలంలోని పెద్దకండ్లగుంట పంచాయతీ జాళ్లపాలెం గ్రామంలో ఇంకుడు గుంతల కార్యక్రమం ఉంటుందని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన గ్రామంలో ఇంకుడు గుంతల ప్రారంభ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య అతిథులుగా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మంత్రి స్వామి పాల్గొంటారని తెలిపారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతంలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎంపీడీవో రామాంజనేయులు, ఏవో రామకృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం

కనిగిరిరూరల్(హనుమంతునిపాడు): కుళ్లిన స్థితిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. శుక్రవారం రాత్రి కనిగిరి కొండ అయ్యప్ప స్వామి గుడి వద్ద రాళ్ల మధ్యలో శుక్రవారం ఓ గుర్తు తెలియని మృత దేహం లభ్యమైనట్లు ఎస్సై శ్రీరామ్ తెలిపారు. మృతుడు తెల్లని షర్టు ధరించి ఉన్నాడని, రాత్రి కావడంతో రాళ్ల మధ్యలో ఆనవాలు కనిపించడం లేదన్నారు. మృత దేహం ఎవరన్నది వివరాలు తెలియాల్సి ఉందన్నారు.


నూతన వధూవరులకు శుభాకాంక్షలు


శుభాకాంక్షలు తెలుపుతున్న ఇన్‌చార్జ్ దద్దాల, నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని పలు వివాహ కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ స్థానిక నాయకులతో కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈసందర్భంగా శుక్రవారం మండలంలోని రామాపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు నారా బాలసిద్దయ్య, ఓబులమ్మ దంపతుల కుమారుడు నారా వీరనారాయణ వివాహ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మండలంలోని అంబవరం కొత్తపల్లె గ్రామానికి చెందిన పార్టీ నాయకులు షేక్ నాగూర్‌వలి బీబీ దంపతుల కుమారుడు షేక్ బాషా వివాహానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, సిద్దు వెంకటరెడ్డి, సీహెచ్ రాధాకృష్ణారెడ్డి, సిద్దు రమణారెడ్డి, కమ్మనేతి వెంకటేశ్వర్లు, పాలుగుళ్ల రత్నారెడ్డి, అద్దంకి రమణయ్య, పెరుగు సుబ్బరామయ్య, జి.లక్ష్మీనరసయ్య, అంబాల శేఖర్ రెడ్డి, షేక్.గౌస్, రజాక్, నామాల్‌రెడ్డి, జాజుల తిరిపాలు, దుద్దెల వెంగళరావు, వై.ప్రవీణ్‌కుమార్, జి.ఆదినారాయణరెడ్డి, స్వర్ణ ఏడుకొండలు, బి.తిరుపతి రెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, శ్యామల సాంబిరెడ్డి, ఎం.వెంకటేశ్వరరెడ్డి, ఈర్ల శ్రీను, దేవిరెడ్డి వెంకట స్వామిరెడ్డి పాల్గొన్నారు.

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): కనిగిరి మున్సిపాల్ పరిధి కొత్తూరులో జరిగిన ఉండేల వారి పెండ్లి వేడుకలో దద్దాల నారాయణ పాల్గొన్నారు. ఉండేల రామిరెడ్డి రత్తమ్మల కుమారుడు వెంకటేశ్వరెడ్డి పెండ్లి వేడుకలో పాల్గొని ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి, సర్పంచ్ స్వర్ణ ఏడుకొండలు, హనుమంతునిపాడు మండల రైతు సంఘ అధ్యక్షులు శ్యామల సాంబిరెడ్డి, నారాయణరెడ్డి, ఈర్ల శ్రీనివాసులరెడ్డి, మడతల వెంకటేశ్వరెడ్డి తదితరులు ఉన్నారు.

హడావుడిగా చెత్త తొలగింపు


చెత్త తొలగిస్తున్న సిబ్బంది

కొండపి: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దకండ్లకుంట పంచాయతీలోని జాళ్లపాలెం గ్రామంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా, మంత్రి స్వామి పర్యటన నేపథ్యంలో కొండపి పంచాయతీ అధికారులు చెత్త తొలగింపు కార్యక్రమాన్ని హడావుడిగా ప్రారంభించారు. కొండపి నుంచి పెద్దకండ్లగుంటకు వెళ్లే దారిలో చెరువు కట్ట ప్రాంతంలో రోడ్డుకిరువైపులా చెత్తాచెదారం, మెడికల్ వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. శనివారం జిల్లా కలెక్టర్, మంత్రి అదే ప్రాంతం నుంచి జాళ్లపాలెం గ్రామం వెళ్లాల్సి ఉండగా పంచాయతీ అధికారులు హడావుడిగా నామమాత్రంగా చెత్త తొలగింపు కార్యక్రమాన్ని జేసీబీతో తొలగిస్తున్నారు. గతంలో కలెక్టర్ జాళ్లపాలెం రోడ్డులోని రక్షిత మంచి నీటి పథకం ట్యాంక్ సందర్శనకు వచ్చినప్పుడు ఆ ప్రాంతంలో ఉన్న చెత్తను చూసి అధికారుల మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పట్లో తూతూ మంత్రంగా ఆ ప్రాంతంలోని చెత్తను తొలగించారు. పంచాయతీ కార్మికులు నిర్లక్ష్యం వీడకుండా పంచాయతీ చెత్తను,వ్యర్థాలను అక్కడే వేస్తున్నారు.

కార్మికుడికి తీవ్రగాయాలు

సింగరాయకొండ: గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన మండల పరిధిలోని బీకే క్రెషర్స్ కంపెనీ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. అస్సాం రాష్టానికి చెందిన ఏ అనిల్ బీకే క్రెషర్స్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కంపెనీ సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. కంపెనీకి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. స్థానికులు అనిల్‌ను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని ఎస్సై బీ మహేంద్ర వివరించారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైతు విశిష్ట సంఖ్య నమోదుతో ఉపయోగాలు


రేగులచెలకలో అవగాహన ర్యాలీ చేస్తున్న వ్యవసాయాధికారులు


పెద్దకండ్లగుంటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో విజయ్‌మార్


అలవలపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ప్రకాష్‌రావు

పీసీపల్లి: రైతులందరూ కూడా విశిష్ట సంఖ్యలో పేర్లను నమోదు చేసుకోవాలని ఏవో కే ప్రకాష్‌రావు అన్నారు. శుక్రవారం రైతు విశిష్ట సంఖ్య నమోదులో భాగంగా పెదఅలవలపాడు రైతుసేవా కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కే ప్రకాష్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా రైతులకు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార్ కార్డు తరహాలో రైతులకు అందించనుందన్నారు. కావున ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల రాయితీలు పొందాలంటే విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. రైతులు మీ గ్రామంలోని రైతుసేవా కేంద్రాల వద్దకు వెళ్లి ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ తీసుకొని వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ పుల్లయ్య వీఏఏ శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ రైతులకు తప్పనిసరి..

కొండపి: ఫార్మర్ రిజిస్ట్రీ రైతులకు తప్పనిసరని ఏవో డీ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెరిదేపి, పెద్దకండ్లగుంట, పెట్లూరు గ్రామాల్లో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏ కే. శ్రీకాంత్, షేక్ మహేష్, ఐ.పద్మ రైతులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): భూమి ఉన్న ప్రతి రైతు విధిగా రైతు సేవాకేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కనిగిరి ఏడీఏ ఎగ్గోని వెంకటరమణ అన్నారు. మండలంలోని రేగులచెలక గ్రామంలో శుక్రవారం రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమంపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏఓ బి.సంపత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ పి.శ్రీనివాసులు, వీఏఏలు చిరంజీవి, అనూష, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి పార్వతీ, పరమేశ్వర విగ్రహ ప్రతిష్ఠ


ప్రతిష్ఠకు సిద్ధంగా ఉంచిన దేవతామూర్తుల విగ్రహాలు

పామూరు: మండలంలోని గోపాలపురం గ్రామం 565 జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మించిన పార్వతీ పరమేశ్వరస్వామి దేవస్థానంలో నేడు శనివారం నుంచి సోమవారం వరకు 3 రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ దాత చిమటా కార్తీక్ తెలిపారు. 15న సోమవారం గణపతిపూజ, రక్షాబందనం, వాస్తుపూజ, యాగశాల ప్రవేశం ఉంటుందన్నారు. 16న జలాధివాసం, క్షీరాధివాసం, వేదపరాయణం, ధాన్యాదివాసం ఉంటుందన్నారు. 17న ఉదయం 8 గంటలకు పార్వతీ, పరమేశ్వరుల విగ్రహప్రతిష్ఠ, గణపతి, సుబ్రమణ్యేశ్వర, నాగేంద్ర, నవగ్రహ, ధ్వజస్తంభ, బలిపీఠవ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పార్వతి పరమేశ్వరుల శాంతి కల్యాణం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పాఠశాలల బలోపేతానికి సహకారం


మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావుతో చర్చిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తనవంతు సహకారం అందిస్తానని కనిగిరి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు కదిరి బాబూరావు అన్నారు. శుక్రవారం మండల ఏపీటీఎఫ్ నాయకులు షేక్.నాయబ్‌రసూల్, తోట శ్రీనివాసులు, జె.ఎస్.ఆనంద్‌బాబు పలువురు బాబూరావును ఆయన నివాసంలో కలిశారు. ఈసందర్భంగా వారు మండలంలో పాఠశాలల అభివృద్ధికి, ఏపీటీఎఫ్ సంఘం బలోపేతానికి సహకారం అందించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందిచారన్నారు. శీలంవారిపల్లెలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు ఇన్నాళ్లు సొంత ఖర్చులతో వసతులు, భోజన వసతి కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జి.రామకృష్ణ, డి.సుబ్బరాయుడు, అహ్మద్, సీఆర్‌పి సతీష్, రమేష్ పలువురు ఉన్నారు.

17న వెలుగొండ ప్రాజెక్టు సాధనకు ధర్నా


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): పశ్చిమ ప్రాంతం ప్రజల వరప్రసాదమైన పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు సాధనకై సీపీఐ చేపట్టే ధర్నాను జయ ప్రదం చేయాలని ఆపార్టీ నాయకులు జిల్లా కార్యాదర్శి వర్గ సభ్యుడు కామ్రేడ్ వై రవీంద్ర బాబు పేర్కొన్నారు. శుక్రవారం దర్శి చెంచయ్య భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వెలుగొండ ప్రాజెక్టు సాధనకు ఈ నెల 17వ తేదీన కనిగిరి ఆర్డీవో కార్యాలయం ముందు ఏర్పాటు చేసే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు నిధులు కేటాయించాలని, వెలుగొండ ప్రాజెక్టు పరిధిలోకి పీసీపల్లి మండలం చేర్చాలని, కనిగిరి ప్రాంతంలోని రిజర్వాయర్లను వెలుగొండ ప్రాజెక్టులోకి అనుసంధానించాలన్నారు. నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయిద్ యాసీన్, సీపీఐ మండల కార్యదర్శి జీవీ రామారావు, రైతు సంఘ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, ఏటీఐయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పామూరు: పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ, పీసీపల్లి మండలాన్ని వెలుగొండ ప్రాజెక్ట్ పరిధిలో చేర్చాలని కోరుతూ ఈనెల 17వ తేదీన కనిగిరి, మార్కాపురం ఆర్డీఓ కార్యాలయాలవద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కే.వీరారెడ్డి పిలుపునిచ్చారు. ఈసందర్భంగా శుక్రవారం స్థానిక గుజ్జుల యల్లమందారెడ్డి భవన్‌లో ధర్నా ప్రచార కరపత్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్‌మౌలాలి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోతల ప్రభాకర్, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య సేవలు మరువలేనివి


సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్, అధికారులు

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): మాజీ సీఎం దామోదరం సంజీవయ్య సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పేర్కొన్నారు. కనిగిరి పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి చైర్మన్, కమిషనర్ డానియేలు జోసెఫ్‌లు నివాలర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా పదవి చేపట్టి పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంస్కరణలు తీసకువచ్చిన గొప్ప నాయకుడు సంజీవయ్య అన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్, ఇన్స్‌పెక్టర్ చెన్నకేశవులు సంఘ సిబ్బంది మెప్మా సీఎంఎంఏ రఘు, పారాలీగల్ వలంటీర్ డైరెక్టర్ రమేష్‌బాబు, కో ఆర్డినేటర్ నవకుమార్, డాక్టర్ నాయబ్ రసూల్ తదితరులు ఉన్నారు.

దళిత బహుజన ప్రజా సంఘల నాయకుల ఆధ్వర్యంలో..

కనిగిరి ఎంఎస్ఆర్ రోడ్డు సుగుణావతం ఆస్పత్రి సెంటర్‌లో నియోజకవర్గ దళిత బహుజన ప్రజా సంఘల నాయకుల ఆధ్వర్యంలో సంజీవయ్య జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ గఫార్, అంబేడ్కర్ ధర్మపోరాట సమితి రాష్ట్ర నాయకుడు చదలవాడ బాలగురవయ్య, దళిత నాయకులు బాల బాదుర్ల, కలకూరి శాంతరాజు, మోహన్‌రావు, చీకటి వెంకట సుబ్బయ్య, సానికొమ్ము తిరుపతరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆధార్ నమోదు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ, తహసీల్దార్

పామూరు: అన్ని గ్రామల్లో 0–6 సంవత్సరాల మధ్య వయస్సు పిల్లలకు విధిగా ఆధార్ నమోదు చేయించాలని తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో బొలినేని సురేష్‌లు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ అధ్యక్షతన బంగారు బాల్యంపై మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలకు వచ్చేలా చూడాలన్నారు. అంగన్‌వాడీల్లో హాజరుశాతం పెంచాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ డీవీ సుబ్బారావు, ఏపీఎం గంటా విద్యాసాగర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, ఎంపీఎస్ పార్వతి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై పారుతున్న మురుగునీరు


ఇంటిముందు పారుతున్న మురుగునీరు

సింగరాయకొండ: మండలంలోని పాత సింగరాయకొండ పంచాయతీ నరసింహా నగర్ కాలనీలో మురుగునీరు రోడ్డుపై పారటంతో ఆ ప్రాంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈప్రాంతంలో మురుగుకాలువలు లేకపోవటంతో ఇంటిముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్నారని, అయితే ఒక్కో ఇంటి ముందు ఉన్న గుంత నిండి మురుగునీరు రోడ్డుపై పారుతుందని కాలనీ వాసులు తెలియజేస్తున్నారు. ఇటీవల రోడ్డు వెడల్పు చేసిన అధికారులు మురుగుకాలువ నిర్మాణంపై నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అంతేకాక పురాణ ప్రసిద్ధి చెందిన వరాహాలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి చుట్టు పక్కల మండలాల ప్రజలు ఈ మార్గం గుండా వెళ్లాల్సి ఉందన్నారు. అయితే గుడికి వెళ్లేటప్పుడు శుచి శుభ్రతతో వెళతారని కాని ఈ విధంగా మురుగునీరు తొక్కుకుంటూ వెళ్లాల్సి వస్తుందని కావున అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో మురుగునీరు రోడ్డు పై పారకుండా చర్యలు తీసుకోవటంతో పాటు కాలువ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.